# చురుకుగా అభివృద్ధి పనులు

■ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం



సంజాపూర్ వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

కల్వకుర్తి, అక్టోబర్ 12 : కల్వకుర్తి పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ, మున్సిపాలిటీ నిధులలో చేపట్టిన అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయి. మున్సిపాలిటీలోని 22 వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యతా క్రమంలో రూ.30లక్షల నుంచి రూ.50లక్షల వరకు సీసీ రోడ్డు, మురుగుకాల్వల నిర్మాణానికి నిధులు కేటాయించారు. 22 వార్డుల్లో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. గురువారం మున్సిపాలిటీలో 8,9 వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను మున్సిపల్ ఏఈ శివకృష్ణతో కలిసి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరిశీలించారు. 8వ వార్డులో చేపట్టిన మురుగుకాల్వల నిర్మాణం, 9వ వార్డులో నాగర్‌కర్నూల్ ప్రధాన రోడ్డు నుంచి సంజాపూర్ వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పర్యవేక్షించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని గుత్తేదారులకు సూచించారు. నాగర్‌కర్నూల్ రోడ్డు నుంచి సంజాపూర్ ఊర్లోకి దాదాపు కిలో మీటర్ వరకు సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. కల్వకుర్తి మున్సిపాలిటీలోని ప్రతి వార్డును అభివృద్ధి చేస్తున్నామని, ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి ఇతోధికంగా నిధులు కేటాయిస్తుందని చెప్పారు. గత నెలలో కల్వకుర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.10 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. సదరు నిధులతో అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభించామని మున్సిపల్ చైర్మన్ వివరించారు. ఆయన వెంట ఆయా వార్డుల కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కల్వకుర్తి, అక్టోబర్ 12 : ఆర్టీసీ ఉద్యోగి కరుణాకర్ కుటుంబాన్ని గురువారం కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరామర్శించారు. 10 రోజుల కిందట ఆర్టీసీ ఉద్యోగి కరుణాకర్ మృతి చెందారు. గురువారం కరుణాకర్ సంతాపసభ నిర్వహించిన నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ముందుగా కరుణాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ నుంచి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



పెద్దలక్ష్మయ్య పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ రాములు

## మాజీ జెడ్పీటీసీకి పితృ వియోగం

■ పరామర్శించిన ఎంపీ రాములు

వంగూరు, అక్టోబర్ 12 : మండలంలోని కొండారెడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ నేత, మాజీ జెడ్పీటీసీ రాంచంద్రయ్య తండ్రి పెద్ద లక్ష్మయ్య(82)గురువారం తెల్లవారుజామున అనారోగ్యానికి గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు గ్రామానికి చేరుకొని పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాంచంద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీ వెంట ఎంపీపీ భీమమ్మలాలు యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

## ఎన్నికల నియమావళిని అమలు చేయాలి



అధికారులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో శ్రీను

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 12 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో అధికారులు ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని కల్వకుర్తి ఆర్డీవో శ్రీను సూచించారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలంటే ఖచ్చితంగా నియమావళిని ప్రతిఒక్కరూ పాటించినపుడే సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల నియమావళిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేయవద్దని గ్రామాల్లో, పట్టణాల్లో ప్రతిఒక్కరూ పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు తనిఖీలు చేస్తున్నప్పుడు డబ్బులు పట్టుబడితే ఏ విధంగా విచారించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎలక్షన్ డీటీ అనిత తదితరులు ఉన్నారు.

## నేటినుంచి పాఠశాలలకు సెలవులు

కల్వకుర్తి రూరల్, అక్టోబర్12 : దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యాశాఖ 13నుంచి(శుక్రవారం)ఈ నెల 25 వరకు 13 రోజుల పాటు పాఠశాలలకు సెలవులను ప్రకటించింది. దసరా సెలవులు రేపటి నుంచి రానుండడంతో విద్యార్థులు గురువారం పాఠశాలలో విద్యార్థులు బతుకమ్మ సంబురాలు జరుపుకొన్నారు. దసరా సెలవుల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలను నడిపితే చర్యలు తీసుకుంటామని ఎంఈవో బాసునాయక్ హెచ్చరించారు. పాఠశాలలకు దసరా సెలవులు ఇవ్వడంతో గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థులు తమ తమ గ్రామాలకు పయనం కావడంతో బస్టాండ్ మొత్తం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడిగా మారింది.

## సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు

వెల్దండ, అక్టోబర్ 12 : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ నింబంధనలు పాటించాలని వెల్దండ ఎస్సై శ్రీనివాస్ సూచించారు. గురువారం వెల్దండ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర గ్రూపుల్లో పార్టీలను రెచ్చగొట్టే విధంగా, కించపర్చే విధంగా, అవమానపర్చేలా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. వీటిపై వాట్సాప్ గ్రూపుల అడ్మిన్లు అప్రమత్తంగా ఉండి, అలాంటి వాటిని పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## సంఘమిత్ర పురస్కారానికి రఘురామారావు ఎంపిక



కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 12 : కల్వకుర్తి మండలం బెక్కర ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రఘురామారావు సంఘమిత్ర జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. హెచ్ఎం రఘురామారావు విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుండడంతో ఫిలాంత్రోఫిక్ వ్యవస్థాపకులు అద్దంకి రాజాయోనాపుడమి సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు చిలుక బాల్‌రెడ్డి హెచ్ఎం రఘురామారావును ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని ఈ నెల 18న ఢిల్లీలో అందించనున్నారని, హెచ్ఎం అవార్డుకు ఎంపిక కావడంపై పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యావంతులు ఆయనకు అభినందనలు తెలిపారు. తనకు అవార్డును ప్రకటించడంపై రఘురామారావు ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా బతుకమ్మ సంబురాలు




మార్చాలలో బతుకమ్మ సంబురాలు నిర్వహించిన ఉపాధ్యాయినులు

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 12 : కల్వకుర్తి మండలం మార్చాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పట్టణంలోని వీబీస్ పాఠశాలలో గురువారం పాఠశాల విద్యార్థులు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయినులు బతుకమ్మలను ఆడారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాములు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ సంబురాలు నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్‌లో..

వెల్దండ, అక్టోబర్ 12 : మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలతో పాటు మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, అధ్యాపకులు తీరొక్కపూలతో పేర్చిన బొడ్డెమ్మలను ఒక చోట ఉంచి బతుకమ్మ వేశారు. కోలాటాలు, ఆటాపాటలతో ఊరేగింపు నిర్వహించారు . అనంతరం స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. దసరా సందర్భగా పాఠశాలకు ఆఖరిరోజు కావడంతో దసరా పండుగ పురస్కరించుకొని బతుకమ్మ సంబురాలు జరపుకున్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పుష్పలత, వైస్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణతోపాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



వెల్దండ మోడల్ స్కూల్‌లో..



కల్వకుర్తిలోని వీబీఎస్ పాఠశాలలో..

## ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



మాట్లాడుతున్న డీఎం శ్రీకాంత్

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 12 : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం, క్షేమదాయకమని ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించాలని కల్వకుర్తి డీఎం శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు. గురువారం కల్వకుర్తి డిపోలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, వ్యాపారులు, ఉద్యోగుల నుంచి పలు సలహాలు, సూచనలు స్వీకరించారు. కల్వకుర్తి టీఎస్ ఆర్టీసీ డిపో ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలను అందిస్తామని డిపో అభివృద్ధికి ప్రయాణికులు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



బదిలీపై వెళ్తున్న జీహెచ్ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తాడూరు, అక్టోబర్ 12 : మండలంలోని సిర్సవాడ జెడ్పీహెచ్ఎస్‌లో కాంప్లెక్స్ జీహెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న తిరుపతయ్య వట్టెం హైస్కూల్‌కు బదిలీ అయిన సందర్భంగా గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా సిర్సవాడ హైస్కూల్‌ను విద్యాపరంగా విద్యార్థులకు ఎన్నో సేవలు నిర్వహించారన్నారు. పాఠశాలకు, విద్యార్థులకు ఎన్నో సేవలందించారని తెలిపారు.

## అందరూ సహకరించాలి

తిమ్మాజిపేట, అక్టోబర్ 12 : ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎస్సై భాస్కర్ గురువారం ప్రకటనలో కోరారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో సోషల్ మీడియాలో వివిధ పార్టీలు, నాయకులను రెచ్చగొట్టే విధంగా, కించపరిచే విధంగా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనవసరమైన కామెంట్లు, పోస్టులు పెట్టే వారి పట్ల ఆయా వ్యాట్సాప్, ఫెస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల అడ్మిన్లు జాగ్రత్తగా ఉండి గమనించాలని లేదంటే వారే పూర్తి బాధ్యత వహించాలన్నారు.